క్లుప్తంగా

తీరప్రాంత భూములను పరిశీలించిన జేసీ



మోటుపల్లి ఆలయాన్ని సందర్శిస్తున్న జేసీ శ్రీధర్

వేటపాలెం: సముద్ర తీరప్రాంత భూములను జేసీ శ్రీధర్, ఆర్డీవో సరోజినీ మంగళవారం పరిశీలించారు. ముందుగా కఠారివారిపాలెం సముద్రతీరం భూములు, రామచంద్రాపురం తీరం వద్ద భూములను పరిశీలించారు. తదుపరి చిన్నగంజాం మండలం పరిధిలోని మోటుపల్లి వద్ద గల పురాతన ఆలయాన్ని సందర్శించారు. ఆలయ ప్రాముఖ్యతను గురించి అడిగి తెలుసుకున్నారు. వీరి వెంట మహేశ్వరి, సర్వేయర్ సాయి ఉన్నారు.

కాపు టీచర్స్ అసోసియేషన్ జేఎస్‌గా నాగమల్లేశ్వరరావు



చినగంజాం: ఆంధ్రప్రదేశ్ కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ బాపట్ల జిల్లా జాయింట్ సెక్రటరీగా సోపిరాల గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు సిద్ధం నాగమల్లేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బాపట్లలో మంగళవారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని తెలిపారు. జాయింట్ సెక్రటరీగా తనను ఎంపిక చేసిన రాష్ట్ర నాయకులు కొల్లా నారాయణరావు, పీవీఎస్ ఫణీంద్ర కుమార్, హరిదాసు, ఎల్వీ మాధవరావుకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

నేడు ద్రోణాదులలో నో టొబాకో ర్యాలీ

మార్టూరు: అంతర్జాతీయ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నేటి ఉదయం ద్రోణాదుల గ్రామంలో ర్యాలీ నిర్వహించనున్నట్లు మెడికల్ ఆఫీసర్ కవితా అనసూయ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక పీహెచ్‌సీ వద్ద నిర్వహించనున్న కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు, స్థానికులు విరివిగా పాల్గొని జయప్రదం చేయాలని ఆమె పిలుపునిచ్చారు.

యువకుడు ఆత్మహత్యాయత్నం

మార్టూరు: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈఘటన మార్టూరులో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. 108 సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. స్థానిక అంబేడ్కర్ కాలనీకి చెందిన యేసు దాసు కుటుంబ కలహాల కారణంగా తన ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడగా గమనించిన స్థానికులు వెంటనే 108 వాహనం ద్వారా స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం చిలకలూరిపేటలో ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు.

పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలి



పారిశ్రామికవేత్తలతో మాట్లాడుతున్న విజయ్‌కుమార్‌రెడ్డి

చీరాల అర్బన్: ఆర్టీసీకి సంబంధించిన ఖాళీ స్థలాలను లీజుకు తీసుకునేందుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని బాపట్ల జిల్లా ప్రజా రవాణాధికారి విజయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌ని కార్యాలయంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో ఆయన మాట్లాడారు. చీరాల ఆర్టీసీ డిపో పరిధిలోని వేటపాలెం బస్టాండ్ వెనుక గల 2619 చదరపు గజాలు, ఇంకొల్లు బస్‌స్టేషన్ వెనుక గల ఐదు ఎకరాల ఖాళీ స్థలాన్ని 15 సంవత్సరాల పాటు లీజుకు ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి 13 మంది పారిశ్రామికవేత్తలు హాజరయ్యారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ జె.శ్యామల, సిబ్బంది పాల్గొన్నారు.

నాడు దీనం.. నేడు ధైర్యం

- ఖరీఫ్ పెట్టుబడికి సాయం సిద్ధం
- రేపు రైతుల ఖాతాల్లోకి రైతు భరోసా
- ఒక్కో రైతుకు రూ. 5,500 చొప్పున జమ
- నియోజకవర్గంలో 44,176 మంది రైతులకు లబ్ధి



బూదవాడ గ్రామంలో దుక్కిదున్నుతున్న రైతు

జే.పంగులూరు: రైతు లేని రాజ్యం అనాథలాంటిది. పట్టెడన్నం పెట్టే రైతన్నలు బాగుంటే రాజ్యాలే బాగుంటాయనే మాట అక్షర సత్యం. అలాంటి వ్యవసాయానికి పెద్దపీట వేసి అగ్రపథాన నిలుపుతోంది వైఎస్సార్ సీపీ ప్రభుత్వం. వ్యవసాయమే దండగా అన్న గత ప్రభుత్వం మాటను చెరిపేస్తూ నేడు వ్యవసాయంతోనే అన్ని వర్గాల అభివృద్ధి అనే స్థాయికి తీసుకువచ్చాడు సీఎం జగన్ మోహన్‌రెడ్డి. వ్యవసాయానికి ఒకటేమిటి ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చి దేశం మొత్తం రాష్ట్రం వైపు చూసేలా చేశాడు. రైతు భరోసా కేంద్రాల ద్వారా నాణ్యమైన విత్తనాలు, పురుగు మందులు, వైఎస్సార్ యంత్ర భరోసా ద్వారా ఆధునిక పనిముట్లు, విత్తన, మట్టి రీసెర్చ్ ల్యాబ్‌లు ఇలా కొత్త తరహా పథకాలు రైతులకు అందించి రైతన్నలకు అండగా నిలుస్తున్నాడు సీఎం జగన్. ఈఏడాది ఖరీఫ్ సాగుకు రైతులు సమాయత్తం అవుతున్నారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్ రైతుభరోసా పథకం ద్వారా రైతులకు పెట్టుబడి సాయం అందజేసేందుకు జగనన్న ప్రభుత్వం ఏర్పాటు చేసింది. తొలివిడత ఆర్థిక సాయాన్ని జూన్ 1న రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేసేందుకు సిద్ధం అయ్యింది. అద్దంకి నియోజకవర్గంలోని ఐదు మండలాలకుగాను 44,176 మంది రైతులకు లబ్ధి చేకూరనుంది. రైతు భరోసా ద్వారా ఒక్కో రైతుకు రూ. 5,500 చొప్పున రూ. 24. 29 కోట్ల మేర లబ్ధిదారుల ఖాతాలోకి జమచేయనున్నారు. కేంద్రం నుంచి అందే పీఎం కిసాన్ ద్వారా రైతులకు మరో రూ. 2 వేలు అందే అవకాశం ఉంది. పీఎం కిసాన్ ద్వారా నియోజకవర్గంలో రైతులు రూ. 88.35 లక్షల మేర లబ్ధి చేకూరే అవకాశం ఉంది. మొత్తం కలిపి ఒక్కో రైతుకు మొదటి విడత రూ.7500 చొప్పున జమ అవుతుందని అధికారులు చెప్తున్నారు.

ఏటా మూడు విడతలుగా..

ప్రతి ఏడాది జనవరి, సెప్టెంబర్–అక్టోబర్, మే–జూన్ నెలల్లో వ్యవసాయ పెట్టుబడి నిమిత్తం ప్రభుత్వం మూడు విడతలుగా వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ ద్వారా ఒక్కో రైతుకు రూ. 13,500 చొప్పున ఆర్థిక సాయం అందుతుంది. ఖరీఫ్ వ్యవసాయ పనులు ప్రారంభానికి నెల రోజులు ముందుగానే ఈ పెట్టుబడి సాయం అందిస్తుంది. ఎరువులు, విత్తనాలు కొనుగోలుతో పాటు దుక్కి, కూలీలు వంటి ఖర్చులకు రైతులు ఇబ్బంది పడకుండా గత నాలుగేళ్లుగా ప్రభుత్వం ఈ సాయం అందిస్తోంది.

నియోజకవర్గంలోని మండలాల రైతుల జాబితా..

మండలం	లబ్ధిదారులు	రైతు భరోసా రూ. కోట్లలో
జే.పంగులూరు	754	4.14 కోట్లు
కొరిశపాడు	5989	3.29 కోట్లు
బల్లికురవ	10245	5.63 కోట్లు
అద్దంకి	10083	5.54 కోట్లు
సంతమాగులూరు	10316	5.67 కోట్లు

అర్హుల జాబితా సిద్ధం చేశాం..



జూన్ 1వ తేదీన వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద ప్రతి రైతుకు రూ. 5,500 పెట్టుబడి సాయం అందనుంది. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా బటన్ నొక్కి కార్యక్రమం ప్రారంభిస్తారు. మండలంలోని 21 గ్రామాలకు సంబంధించిన రైతుల జాబితాను సిద్ధం చేశాం. అదే రోజు పీఎం కిసాన్ పథకం కింద మరో రూ. 2 వేలు అందనున్నాయి.

ఏవో సుబ్బారెడ్డి, మండల వ్యవసాయాధికారి

మాటతప్పని, మడమతిప్పని నాయకుడు జగనన్న

- జగనన్న పాలన నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా బైక్ ర్యాలీ
- పాల్గొన్న ఏపీ శాప్‌నెట్ ఛైర్మన్ కృష్ణచైతన్య



బైక్ ర్యాలీలో పాల్గొన్న శాప్‌నెట్ ఛైర్మన్ కృష్ణచైతన్య

అద్దంకి రూరల్: ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రతిపక్షాలు ఎన్ని అడ్డంకులు సృష్టించిన మాటతప్పని, మడమ తిప్పని నాయకుడు ఒక్క సీఎం జగన్ మోహన్‌రెడ్డినే అని ఏపీ శాప్‌నెట్ ఛైర్మన్, అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కృష్ణచైతన్య అన్నారు. చంద్రబాబు నాయుడు పేదలను అవమానిస్తు చేసిన అహంకారపూరిత వ్యాఖ్యలకు నిరసన స్థానిక ఆర్ అండ్ బీ బంగ్లా నుంచి పార్టీ కార్యకర్తలతో కలిసి స్థానిక వైఎస్సార్ విగ్రహం వరకు మంగళవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీఎంగా జగన్ ప్రమాణ స్వీకారం చేసి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా భారీకేక్ కట్‌చేశారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా కృష్ణచైతన్య మాట్లాడుతూ సీఎం జగనన్న నవరత్నాలతో ఇచ్చిన ప్రతి హామీని నాలుగేళ్లలోనే నెరవేర్చారన్నారు. ఇటీవల మహానాడులో చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టోలో సాధ్యం కానివాటిని చెప్పి ప్రజలకు మభ్యపెట్టటానికి ప్రయత్నిస్తున్నారన్నారు. సీఎం జగన్ ఇస్తున్న సంక్షేమ పథకాలతో రాష్ట్రం అప్పుల పాలవుతుందని, మరో శ్రీలంక అవుతుందని మాట్లాడిన చంద్రబాబు ఇప్పుడు లక్షల కోట్లతో సంక్షేమ పథకాలు ప్రకటిస్తే రాష్ట్రం శ్రీలంకగా మారదా అని ప్రశ్నించారు. పదవి కోసం చంద్రబాబు నాయుడు ఎటువంటి దుర్మార్గపు చర్యలకైనా పాల్పడతారన్నారు. రానున్న ఎన్నికల్లో జగనన్నకు అండగా ఉండి మరలా సీఎం చేసుకోవాలన్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో, శింగరకొండలో వృద్ధులకు దుప్పట్లు, పండ్లు అందజేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్‌లు, మున్సిపల్ వైస్ ఛైర్మన్‌లు, వార్డు కౌన్సిలర్‌లు, సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



వృద్ధురాలికి దుప్పట్లు అందజేస్తున్న కృష్ణచైతన్య

జగనన్న పాలనలో నాలుగేళ్ల సంబరాలు



మార్టూరులో కేక్ కట్ చేస్తున్న నాయకులు



ఇంకొల్లులో కేక్ కట్ చేస్తున్న నాయకులు

ఇంకొల్లు (చినగంజాం): సీఎం వైఎస్ జగన్ మోహనరెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి ఆయన పాలనకు నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా ఇంకొల్లులో మంగళవారం సంబరాలు నిర్వహించారు. ఇందులో భాగంగా మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకులు ఇంకొల్లు సెంటర్ నందు బాణ సంచా కాలుస్తూ కేక్‌ను కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం కన్వీనర్ చిన్ని పూర్ణారావు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ తానికొండ ఎలియాజర్, భీమవరం సర్పంచ్ చెన్నుపాటి స్వామి, ప్రచార దళ కమిటీ కన్వీనర్ అమ్మిశెట్టి శ్రీనివాసులు, స్టీరింగ్ కమిటీ సభ్యులు షేక్ షంషుద్దీన్, విద్యార్థి విభాగం అధ్యక్షుడు సునీల్, ఇంకొల్లు సొసైటీ ప్రెసిడెంట్ పాటిబండ్ల గోపి, సీనియర్ నాయకులు సుధాకర్, తానికొండ సత్యం, నెల్లూరు శ్రీను,లాజర్, షేక్ మస్తాన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మార్టూరులో కేక్ కట్ చేసిన నాయకులు..

మార్టూరు: సీఎం వైఎస్ జగన్ మోహనరెడ్డి పదవీ బాధ్యతలు చేపట్టి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా మండల కేంద్రం మార్టూరులో మంగళవారం అధికార పార్టీ నాయకులు కేక్‌ను కట్ చేసి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక గన్నవరం రోడ్డులో నిర్వహించిన కార్యక్రమంలో మండల కన్వీనర్ పఠాన్ కాలేషావలి, వక్ఫ్ బోర్డు జిల్లా కార్యదర్శి గడ్డం మస్తాన్‌వలి, ఎస్సీ సెల్ కన్వీనర్ సుకుందరావు, ఎంపీటీసీ కరిముల్లా, సులేమాన్, రఫి, కే సుబ్బయ్య పాల్గొన్నారు.

స్వామి వారి ఊరేగింపునకు రథం సిద్ధం



ఊరేగింపునకు సిద్ధంగా ఉన్న రథం

మేదరమెట్ల: కొరిసపాడు మండలం కృష్ణంరాజువారి పాలెం (రెడ్డిపాలెం) సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వార్షిక తిరుణాల సందర్భంగా నూతన రథాన్ని మంగళవారం ప్రారంభించారు. నేడు వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం జరుగుంతుందని నిర్వాహకులు తెలిపారు. కల్యాణంలో వేలాదిగా భక్తులు వస్తారని చెప్పారు. అందకు తగినట్లుగా దేవస్థానం తరపున అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు.

ఘనంగా పోలేరమ్మ వారి తిరునాళ్ల



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

చినగంజాం: గ్రామ దేవత పోలేరమ్మ అమ్మవారి తిరునాళ్ల మహోత్సవం సోపిరాల గ్రామంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని భక్తులు అమ్మవారికి సద్ది, వడపప్పు, పానకం చెల్లించి తమ మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు బిందెలతో నీటిని తీసుకొని గ్రామంలో ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి జలాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అమ్మ వారికి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న సమయంలో భారీ వర్షంతో కూడిన ఈదురుగాలులు వీయడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. సోమవారం రాత్రి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ ఎడ్ల పోటీలను ప్రారంభించి అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

మార్టూరు: ఓ యువతి కనిపించకుండా పోయిన విషయమై మంగళవారం రాత్రి మార్టూరు పోలీసు కేసు నమోదు చేశారు. ఏఎస్సై బాషా వివరాల మేరకు.. నాగరాజుపల్లి గ్రామానికి చెందిన బద్దేటి వెంకటరావు ఈనెల 25వ తేదీ తన భార్యతో కలిసి చిలకలూరిపేట వెళ్లి సాయంత్రానికి ఇంటికి తిరిగి వచ్చారు. ఇంట్లో ఉండాల్సిన తమ కుమార్తె కనిపించక పోయేసరికి గ్రామంలోను ఇతర ప్రాంతాల్లో కుమార్తె ఆచూకీ కోసం ప్రయత్నించారు. ఈ క్రమంలో తమ కుమార్తెతో కలసి మార్టూరులోని ఓ కళాశాలలో డిగ్రీ చదివిన చిలకలూరిపేట మండలం మురికిపూడి గ్రామానికి చెందిన కొమ్మనబోయిన తిరుమల శ్రీనివాస్ అనే యువకుడిపై తమకు అనుమానం ఉన్నట్లు చెప్పారు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై బాషా తెలిపారు.



కేక్‌ను కట్ చేస్తున్న కరణం వెంకటేష్, వైఎస్సార్ సీపీ నాయకులు

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా జగనన్న పాలన

- చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్

చీరాల: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్నారని వైఎస్సార్ సీపీ చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ పేర్కొన్నారు. సీఎంగా జగనన్న నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో కరణం వెంకటేష్, కౌన్సిలర్లతో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందజేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పరుగులు పెట్టిస్తున్నారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన మేనిఫెస్టోలో చెప్పిన ప్రతి హామీని అమలు చేసి 98 శాతం పూర్తి చేసిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించి ప్రజల మనస్సు గెలుచుకున్న నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. రాబోయే ఎన్నికల్లో కూడా అందరూ సమష్టిగా కృషి చేసి అత్యధిక సీట్లతో జగనన్నను గెలిపించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ ఛైర్మన్లు బొనిగల జైసన్‌బాబు, ఎస్ రామసుబ్బులు, మున్సిపల్ కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అధికారుల పనితీరు మార్చుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్లు



మాట్లాడుతున్న ఛైర్మన్ శ్రీనివాసరావు

- వాడివేడిగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

చీరాల అర్బన్: మున్సిపల్ కౌన్సిల్ సమావేశాల్లో కౌన్సిలర్లు అడిగిన సమాచారాన్ని నెల రోజులు అయినా ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారు.. మీరు చేసే జాప్యం వలన ప్రజా ప్రతినిధులమైన తాము ప్రజల అడిగిన ప్రశ్నలకు ఏం సమాధానం చెబుతాం? ఇకనైనా అధికారులు పనితీరు మార్చుకోవాలంటూ మున్సిపల్ ఛైర్మన్, కౌన్సిలర్లు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చీరాల మున్సిపల్ కౌన్సిల్ సమావేశం మంగళవారం మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో మున్సిపల్ ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. కొంతమంది మున్సిపల్ అధికారుల పనితీరు వలన కౌన్సిలర్లుకు, తనకు చెడ్డపేరు వస్తుందని అధికారులు సమన్వయంతో చిత్తశుద్ధితో ప్రజలకు జవాబుదారీతనంతో విధులు నిర్వర్తించాలని మున్సిపల్ ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు అన్నారు. అలానే సమావేశంలో పలువురు కౌన్సిలర్లు అధికారుల తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారుల తప్పిదాల వలన ప్రజల చేత తాము నిందలు పడాల్సి వస్తోందని వైస్ ఛైర్మన్ బొనిగల జైసన్‌బాబు, కౌన్సిలర్లు బత్తుల అనిల్, కీర్తి వెంకట్రావు, మించాల సాంబశివరావు, మామిడాల రాములు ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌన్సిల్ సమావేశానికి పట్టణంలోని అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని సూచించినా ఎవరూ హాజరు కాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పట్టణంలో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉందని, తన వార్డులో పలువురు కుక్కకాటు గురయ్యారని దానికి పరిష్కార మార్గం చూపాలని కౌన్సిలర్ సూరగాని లక్ష్మి కౌన్సిల్ దృష్టికి తెచ్చారు. సమావేశంలో మొత్తం అజెండాలోని 43 అంశాలపై చర్చ నిర్వహించారు. కారంచేడు రోడ్డులోని ప్రైడ్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు మంచినీటి సదుపాయం కల్పించేందుకు మున్సిపాలిటీ సమ్మర్ స్టోరేజి ట్యాంకు నుంచి వాటర్ పైపులైను వేయడానికి సంబంధించిన అంశాన్ని కూడా కౌన్సిల్ వాయిదా వేసింది. పట్టణంలోని పలు వార్డుల్లో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాల పనులను కౌన్సిల్ ఆమోదించింది. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కే రామచంద్రారెడ్డి, మున్సిపల్ డీఈ ఏసయ్య, పలువురు అధికారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ధ్వజస్తంభం పునఃప్రతిష్ట

వేటపాలెం: స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామి దేవస్థానంలో జీవ ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠకు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పర్ణశాలలో పండితులు హోమాలు నిర్వహించారు. ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతన ధ్వజస్తంభం ఏర్పాటుకు ఆర్థిక సహకారం అందించిన దాత ఎన్ఆర్ఐ కోడూరి కిరణ్ దంపతులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం ప్రాంగణంలో పురాతన ధ్వజస్తంభం శిథిలావస్థకు చేయడంతో దాన్ని ఇటీవల తొలగించారు. దాని స్థానంలో నూతన జీవధ్వజ స్తంభాన్ని బుధవారం పునఃప్రతిష్ఠించనున్నారు.



నూతన ధ్వజస్తంభానికి మహిళల పూజలు

కారు ఢీకొని గేదె మృతి

బల్లికురవ: రోడ్డు దాటుతున్న గేదెను వేగంగా వెళ్తున్న కారు ఢీకొట్టటంతో గేదె అక్కడిక్కడే చనిపోయింది. ఈ ఘటన మంగళవారం మేదరమెట్ల–నార్కెట్‌పల్లి నామ్ రహదారిలోని మండలంలోని ఎస్ఎల్ గుడిపాడు గ్రామంలో జరిగింది. అందిన సమాచారం ప్రకారం గ్రామానికి చెందిన పసల రామకృష్ణకు సంబంధించిన గేదె రోడ్డు దాటుతుండగా ఒంగోలు నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు ఢీకొట్టటంతో గేదె అక్కడిక్కడేచనిపోయింది. చనిపోయిన గేదె విలువ రూ.50 వేల పైచిలుకు ఉంటుందని బాధిత రైతు తెలిపారు. ఘటనా ప్రదేశాన్ని ఎస్సై వీ. వేమన పరిశీలించి కేసు నమోదు దర్యాప్తు చేపట్టారు.